

మహిళలకు ప్రత్యేక భద్రత కల్పించాలి

కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన ఆందోళనకు గురిచేస్తుంది. ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలలు, లేడీస్ హాస్టళ్లలో మహిళల సంరక్షణకు ప్రత్యేక ప్రత్యేక భద్రత కల్పించాలి. మహిళలపై హత్యాచారాలు, డాడులకు పాల్పడినవారికి ఉరి శిక్ష విధించాలి. ఈ మేరకు చట్టాల్లో మార్పులు తీసుకురావాలి. మహిళల ఫిర్యాదులపై త్వరితగతిన పోలీసులు స్పందించి కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ ఇందిరాశ్రీ, పీహెచ్‌సీ, జి.వేమవరం



హత్యాచార ఘటన అమానుషం

కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన ఘటన అమానుషం. వైద్యులపై దాడి హేయమైన చర్య. మనుషుల ప్రాణాలు కాపాడేందుకు పగలు, రాత్రి తేడా లేకుండా వైద్యులు విధులు నిర్వహిస్తుంటారు. అలాంటి వారిపై దాడులు చేయడం శోచనీయం. ప్రభుత్వాలు వైద్యులపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యురాలిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి.

– పబ్బినీడి విజయ్, వైద్యుడు, తాళ్లరేవు



ఆయువు పోయని ఆయుష్మాన్ భారత్

- అత్యవసర వైద్యానికి అక్కరకు రాని కేంద్ర పథకం
- హెల్త్ కార్డులున్నా వైద్యం చేసేందుకు కార్పొరేట్ ఆసుపత్రుల నిరాకరణ

యానాం: ఆయుష్మాన్ భారత్ కోట్లాదిమందికి ప్రాణాలు పోస్తుందన్న కేంద్ర నేతల మాటలు నమ్మి హెల్త్‌కార్డులు తీసుకుని కార్పొరేట్ ఆసుపత్రులకు వెళుతున్న పేదలకు నిరాశే ఎదురవుతోంది. ఆయుష్మాన్ భారత్ యోజన, ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన(పీఎంజేఏవై) పేరుతో పిలిచే ఈ పథకం అత్యవసర సమయాల్లో ఆదుకుంటుందంటూ ఇచ్చిన హెల్త్‌కార్డులు ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి. ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులను కార్పొరేట్ ఆసుపత్రులన్నీ మూకుమ్మడిగా తిరస్కరిస్తుండడంతో నిరుపేదలు తమ వైద్య ఖర్చుల కోసం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

ఎటు చూసినా తిరస్కరణే

ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్యసంరక్షణ పథకాలలో ఒకటిగా చెబుతున్న ఆయుష్మాన్ భారత్ 2018 సెప్టెంబర్‌లో ప్రారంభించారు. పుదుచ్చేరిలో 2019 ఆగస్టులో అప్పటి సీఎం నారాయణసామి, అప్పటి వైద్యారోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు ఈ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఏడాదికి రూ.5 లక్షల వరకూ వైద్య చికిత్స, మందుల ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇచ్చారు.



ఆయుష్మాన్‌భారత్ పథకాన్ని ప్రారంభించిన అప్పటి సీఎం నారాయణసామి, అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి(ఫైల్)

పుదుచ్చేరి వ్యాప్తంగా 1.03 లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతాయన్నారు. అంతేకాదు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆయుష్మాన్ హెల్త్‌కార్డు ద్వారా గుర్తింపు పొందిన 77 ఆసుపత్రుల్లో క్రిటికల్ ఇన్సూరెన్స్ ద్వారా ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, క్యాన్సర్, గుండె సంబంధితమైన 1350 రకాల వైద్య సేవలను ఉచితంగా అందించాల్సి ఉంటుంది. అయితే ఆచరణలో మాత్రం ఈ పథకం అమలు కావడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయల మేర బకాయిలు ఉండిపోయాయంటూ ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలు చికిత్సకు నిరాకరిస్తున్నారని చెబుతున్నారు. రాజధాని పుదుచ్చేరికి వందలాది కిలోమీటర్ల దూరంలో ఉండటంతో యానాం రోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆయుష్మాన్ భారత్ లోగో

రాష్ట్ర స్థాయిలో నిర్ణయం తీసుకోవాలి



ఆయుష్మాన్‌భారత్ పథకం ద్వారా వైద్యసేవలకు వివిధ కార్పొరేట్ ఆసుపత్రులకు సిఫార్సు చేస్తున్నాం. ఎంతో ఒత్తిడి తెస్తేగాని వారు రోగులను చేర్చుకోవడం లేదు. ఒక్కోసారి ఏదో సాకు చూపి వైద్యం చేయడం లేదు. ప్రధానంగా ఈ పథకం ద్వారా వైద్యానికి ప్రభుత్వం అందిస్తున్న ప్యాకేజీలు సరిపోవడం లేదంటున్నారు. కొన్ని ఆసుపత్రుల్లోనైతే రోగుల నుంచి ముందుగానే సొమ్ములు కట్టించుకుంటున్నారు. రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులు దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి వుంది.

– డాక్టర్ టి.రవిశంకర్, డిప్యూటీ డైరెక్టర్, జీజీహెచ్, యానాం

వచ్చే నెల 1 నుంచి ఆందోళనలు



కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్

అమలాపురం టౌన్: సీపీఐ పార్టీ జాతీయ కమిటీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ అధిక ధరలకు వ్యతిరేకంగా జిల్లాలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు డేగా ప్రభాకర్ అన్నారు. జిల్లా పార్టీ నాయకుడు శీలం వెంకటేష్ అధ్యక్షతన స్థానిక నల్ల వంతెన దిగువన గల ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ప్రభాకర్ మాట్లాడారు. పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలు నిత్యావసర వస్తువుల ధరల భారం మోయలేక సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అధిక ధరలపై నిరసనలు వ్యక్తం చేయాలని తీర్మానించారు. సెప్టెంబర్ 6వ తేదీన అమలాపురంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు తెలిపారు.

పట్టణ మాస్టర్ ప్లాన్‌కు ఆమోదం

- డ్రైయిన్లలో పూడిక తీతకు సంబంధించిన టెండర్ల రద్దు
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల తీర్మానం

అమలాపురం టౌన్: పట్టణ భవిష్యత్ అభివృద్ధి కోసం పలు మార్పులు, చేర్పులతో మాస్టర్ ప్లాన్‌కు కౌన్సిల్ సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోద ముద్ర వేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో రహదారుల వెడల్పును తగ్గించేలా, మరికొన్నిచోట్ల పెంచేలా సమగ్రంగా చర్చించి మాస్టర్ ప్లాన్‌కు పచ్చజెండా ఊపారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, కౌన్సిలర్లు సంసాని బులినాని, నాగారపు వెంకటేశ్వరావు, చిట్టూరి పెదబాబు, బండారు గోవిందు, యేడిద శ్రీను, బొర్రా వెంకటేశ్వరరావు, అబ్బిరెడ్డి చంటి తదితరులు పలు సమస్యలపై తమ గళం వినిపించారు.

రూ.20 లక్షల పనుల టెండర్ల రద్దు

అజెండాలో 2, 3, 4 అంశాలుగా ఉన్న డ్రైయిన్లలో సిల్ట్ తొలగింపు విషయమై పాలక పక్ష కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని ఇంజినీరింగ్ విభాగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలం అయ్యాక పూడికతీత పనులు పెట్టారంటే మీ సొంత లాభాల కోసం, మీ జేబులు నింపుకోవడం కోసం ఆ పనులు ఎంపిక చేశారా...? అంటూ నిలదీశారు. అలాగే అజెండాలో అయిదో అంశంగా పేర్కొన్న లైమ్, బ్లీచింగ్ కొనుగోలు విషయంపై కూడా కౌన్సిలర్లు అభ్యంతరం చెప్పి ఆ అంశాన్ని కూడా రద్దు చేశారు. ఈ నాలుగు అంశాలకు సంబంధించి దాదాపు రూ.20 లక్షలతో డ్రైయిన్లలో సిల్ట్ తీత పనులు, లైమ్, బ్లీచింగ్ కొనుగోలు టెండర్లను రద్దు చేస్తున్నట్లు పాలక పక్ష కౌన్సిలర్లు ప్రకటించారు. ఈ పనులు కౌన్సిలర్లకు కూడా తెలియకుండా ఎవరి కోసం పెట్టారని ఇంజినీర్లను నిలదీశారు. ఈ పనుల్లో రూ.14 లక్షల వరకూ బాక్స్ టెండర్లు ఎందుకు పిలిచినట్లు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కూడా అక్రమ కట్టడాలు, నోటీసుల జారీ విషయంలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని పలువురు కౌన్సిలర్లు మండిపడ్డారు.



సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

కమిషనర్, డీఈఈ రాకపోవడంపై ఆగ్రహం

ఓ పక్క మాస్టర్ ప్లాన్, మరో పక్క అన్నా క్యాంటీన్ శకటం, దాదాపు రూ.20 లక్షలతో చేపట్టబోయే డ్రైయిన్లలో పూడిక తీత, లైమ్, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలుకు సంబంధించి అజెండాలో కీలక అంశాలపై చర్చ జరుగుతున్న సమావేశానికి కమిషనర్, డీఈఈ ఎందుకు రాలేదంటూ ఎమ్మెల్సీ సహా, పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. ఇకపై పనిచేయని, మాట వినని అధికారులపై కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసి వారిని బదిలీలపై పంపించి వారి స్థానంలో కొత్తవారిని తీసుకొద్దామంటూ ఎమ్మెల్సీ చేసిన సూచనకు కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు.

అధికార పార్టీ నేతలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాయుడు సునీత



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కోరంగి ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి

- తాళ్లరేవు మండల ప్రజాపరిషత్ సమావేశంలో మండిపడిన ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి

తాళ్లరేవు: గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండా అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కోరంగి ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన మంగళవారం జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కోరంగి ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో చేసే అభివృద్ధి పనులు తమకు తెలియకుండా అధికార పార్టీ నాయకులు ఏకపక్షంగా ప్రతిపాదించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. తాము రాజ్యాంగబద్ధంగా ప్రజల చేత ఎన్నుకోబడ్డామని, దొడ్డిదారిన ప్రజాప్రతినిధులం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎంపీపీ రాయుడు సునీత మండల పరిధిలో ఏ కార్యక్రమం చేసినా అధికారులు విధిగా ప్రొటోకాల్ పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి అధికారులు తప్పనిసరిగా స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. స్థానిక సామాజిక ఆస్పత్రిలో గర్భిణులకు సరైన వైద్యం అందడం లేదని, అత్యవసర పరిస్థితుల్లో కాకినాడ తరలిస్తున్నారని పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు ప్రస్తావించారు. ఆర్టీసీ బస్సులు వస్తే ఒకేసారి వస్తున్నాయని, లేదంటే ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని పలువురు ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, వైస్ ఎంపీపీ కొపనాతి లలిత, ఎంపీడీఓ ఎం.అనుపమ, సూపరింటెండెంట్ చింతా మోహనకృష్ణ, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, ఎఫ్‌డీఓ గోపి, పలువురు సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్త కావాలి

అమలాపురం రూరల్: విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలకు పదునుపెట్టాలని, ప్రతి విద్యార్థి ఒక శాస్త్రవేత్త కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమలకుమారి, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ ఎ.మధుసూదన్‌రావులు పిలుపునిచ్చారు. మండలంలోని వన్నె చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గుబ్బల నాగ సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవ ముగింపు వేడుకలకు వారిద్దరూ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ మాట్లాడుతూ అంతరిక్ష ప్రయోగాల్లో భారతదేశం ప్రపంచ దేశాల సరసన నిలిచిందన్నారు. అంతరిక్ష శాస్త్ర పితామహుడు విక్రమ్ సారాభాయ్ వేసిన బాటలో ఎందరో శాస్త్రవేత్తలు దేశాన్ని పురోగతి వైపు నడిపించారన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృతం, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న డీఈవో కమలకుమారి, మధుసూదన్‌రావు

కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గిరిజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు, ఏపీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి గుబ్బల సూర్యప్రకాష్‌రావు, యంగ్ మెన్స్ స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షుడు వాకాడ చిన్న, గౌరవాధ్యక్షుడు నరాల కృష్ణ కుమార్, సాంస్కృతిక సలహాదారు పిల్లి గోవిందరాజు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

యానాం: కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని మంగళవారం పట్టణ పరిధిలోని భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయ మండపంలో స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టికొట్టే కార్యక్రమం అందరినీ అలరించింది. ఈ సందర్భంగా చిన్నారులు, యువకులు ఉట్టికొట్టేందుకు పోటీ పడ్డారు. పలువురు చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణ గావించారు. కార్యక్రమంలో మొండి సత్యనారాయణ, వీరబాబు, ఏసుబాబు, గుర్రం నాని, మట్టా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై నివేదిక పంపాలి

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న గ్రూప్-ఏ, బీ కేటగిరీల అధికారులపై వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి అధికారులు నివేదిక పంపాలని ప్రభుత్వ కార్యదర్శి కన్నన్ సర్క్యులర్‌ను మంగళవారం జారీచేశారు. ఇప్పటికే అటువంటి అధికారులపై శాఖాపరమైన విచారణ జరుగుతుందన్నారు. ఫిర్యాదులు వచ్చిన అధికారుల వివరాలను తనకు పంపాలని ఎల్జీ కె.కై లాష్‌నాథన్ ఆదేశించారన్నారు. విచారించిన అధికారుల సమాచారాన్ని క్రమశిక్షణా చర్యలకై ఎల్జీకి పంపుతామన్నారు. కావున ఈనెల 31లోగా సంబంధిత అధికారుల వివరాలను ఈ-మెయిల్ చేయాలన్నారు.

కార్మికుల కోసం కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలి

అమలాపురం రూరల్: కొబ్బరిలో దింపు, ఒలుపు, నాడెం, మోక, తరుగుడు, పీచు, తాళ్లు, ఎగుమతి, దిగుమతిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న కార్మికుల కోసం ఒక ప్రత్యేక కొబ్బరి బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు కొబ్బరి కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డేపల్లి నాగేశ్వరరావు మంగళవారం వినతి పత్రం అందించారు. కార్మికులకు 50 ఏళ్లకు పింఛన్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి కొబ్బరి బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే ఆనందరావుకు వినతి పత్రం అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

యూటీఎఫ్ సీనియర్ నేత నడింపల్లి మృతి

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన యూటీఎఫ్ సీనియర్ నేత నడింపల్లి రామకృష్ణంరాజు (87) తన స్వగృహంలో మంగళవారం మృతి చెందారు. రామకృష్ణంరాజు భౌతిక కాయాన్ని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, యూటీఎఫ్, ప్రజా సంఘాల నేతలు సందర్శించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఆర్.వీరాస్వామి, డి.శ్రీరామమూర్తి, బీఎస్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు తదితరులు సంతాపం తెలియజేశారు.

వైద్య విద్య నోడల్ సలహాదారుగా శ్రీరాములు

యానాం: పుదుచ్చేరి హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ శ్రీరాములును వైద్యవిద్య నోడల్ సలహాదారుడిగా నియమిస్తూ ఆరోగ్యశాఖ కార్యదర్శి పి.ఇజమోలు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ శ్రీరాములుకు ఇందిరాగాంధీ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సలహాదారుగా పోస్టింగ్ ఇచ్చారు. అదేవిధంగా గోరిమేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఎం.చిత్రకు పేషెంట్ కేర్ విభాగంలో పోస్టింగ్ ఇచ్చారు.

అమలాపురానికి డిగ్రీ కళాశాల మంజూరు చేయాలి

- ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్: అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయా లని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవీ) ప్రభుత్వానికి సూచిస్తూ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేదని, ఇక్కడ ఉన్న అన్ ఎయిడెడ్ కళాశాలలో పేద విద్యార్థులు డిగ్రీ చదవాలంటే అధిక ఫీజులు భరించలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రావులపాలెం, రామచంద్రపురం, మండపేటల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్న దృష్ట్యా అడ్మిషన్లు బాగా పడిపోయిన ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అమలాపురానికి తరలించాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. కొత్తపేట నియోజకవర్గంలో ఇప్పటికే రావులపాలెం, ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ ప్రతిపాదన సాధ్యం కాకపోతే అమలాపురానికి కొత్త ప్రభుత్వ డిగ్రీ కళాశాలనైనా మంజూరు చేయాలని ఆయన సూచించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ఐ.పోలవరంలో నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఐ.పోలవరం: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఐ.పోలవరం మండల సెంటర్‌లో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అధ్యక్షుడు ఎ.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వైద్య సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టం చేయాలని, దేశంలో అన్ని స్థాయిల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బెంగాల్ ప్రభుత్వం నిందితులను రక్షించేందుకు ప్రయత్నిస్తుండడం చాలా బాధాకరమన్నారు. సుప్రీంకోర్టు ఎన్ని చట్టాలు చేసినా అమలు చేసే రాజకీయ నాయకుల మెదళ్లలో విషపూరిత ఆలోచనలు ఉంటే ఇలాంటి ఘటనలే పునరావృతమవుతాయన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ నాయకులు అనిశెట్టి వెంకటేష్, విధి శ్రీను, ఇళ్ల సూరిబాబు, పాటి కృష్ణకుమారి, లక్ష్మీదేవి, గంగాభవాని, దుర్గ, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్ర గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో చొల్లంగి వద్ద మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక రైతుకు తీవ్రగాయాలయ్యాయి. చొల్లంగి పప్పుల మిల్లు ప్రాంతానికి చెందిన నీలపాల వీర వెంకట సత్యనారాయణ సైకిల్‌పై చొల్లంగి గొడౌన్ ప్రాంతంలోని తన మకాం వద్దకు వెళుతుండగా కాకినాడ వైపు వెళుతున్న ఆటో ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన సత్యనారాయణను స్థానికులు హుటాహుటీన కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కోరంగి ఎస్‌ఐ పి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యమాల ఫలితమే 'ఉపాధి'

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న సమయంలో వ్యవసాయ కార్మిక సంఘం పలు ఉద్యమాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న ఫలితమే ఉపాధి హామీ పథకమని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎంప్లాయీస్ హోమ్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'సంఘం విశిష్టత- ఉపాధి హామీ ఆవశ్యకత' అనే అంశంపై మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంఘం రాష్ట్ర నాయకుడు కారెం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘ విశిష్టత, సాధించిన ఉద్యమ ఫలితాలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రతినిధులు తాడి శ్రీరామమూర్తి, పొలమూరి శ్రీనివాసరావు, ఇసుకపట్ల మంగాదేవి, బీర వెంకట్రావు, పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి వక్తృత్వ పోటీలకు ఎంపిక



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థినులు

ఉప్పలగుప్తం: మండలానికి చెందిన భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇంగ్లిష్ వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటీల్లో శిరంగు శృతి, కుంపట్ల చాతుర్య ప్రథమ స్థానంలో నిలిచారు. వారు వచ్చే నెల సెప్టెంబర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వీరిని డీఈఓ కమలకుమారి, ఏంఈఓ రాంబాబు, ఏపీఓ ఎంకే భీమారావు, హెచ్‌ఎం ఎస్.సత్యనారాయణ, ఉపాధ్యాయుడు ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

యానాం: నియోజకవర్గ పరిధిలో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమై సుమారు 40 రోజుల పాటు నిర్వహించే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పుదుచ్చేరి స్టేట్ జనరల్ సెక్రటరీ మోహన్‌కుమార్ కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో బీజేపీ ఉపాధ్యక్షుడు దంగుడు బియ్యం సత్యనారాయణ అధ్యక్షతన బీజేపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ భారతి మోహన్, కనకాల రామదాసు, సబ్బతి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుని కల్యాణ మహోత్సవం



తాళ్లరేవు యాదవపేటలో శ్రీకృష్ణుని కల్యాణాన్ని జరిపిస్తున్న వేద పండితులు

తాళ్లరేవు: పవిత్ర కృష్ణాష్టమి పర్వదిన వేడుకల సందర్భంగా తాళ్లరేవు యాదవపేటలో మంగళవారం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుని కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేద పండితులు ఖండవిల్లి కేశవాచార్యులు నేతృత్వంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

మధ్యాహ్న భోజన కిచెన్ ఆకస్మిక తనిఖీ



సెంట్రల్ కిచెన్‌ను తనిఖీ చేస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారుచేసే అన్నపూర్ణాలయ సెంట్రల్ కిచెన్‌ను మంగళవారం ఆర్‌ఏఓ మునిస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాల నాణ్యతతో పాటు తయారీకి వినియోగించే నూనె, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలను తయారుచేసి పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అన్నపూర్ణాలయ కిచెన్ ఇన్‌చార్జి పాము సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న పెట్రోల్ ట్యాంకర్



సమనసలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న పెట్రోల్ ట్యాంకర్

అమలాపురం రూరల్: విద్యుత్ స్తంభాన్ని ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టిన ఘటన సమనస ప్రధాన రహదారిలో చోటుచేసుకుంది. మంగళవారం ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం వైపు వెళుతున్న పెట్రోల్ ట్యాంకర్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం పక్కకు ఒరిగిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్‌శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు.